

పాము కాటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని బూర్జ పంచాయతీ వాసనరంగని గ్రామంలో పాము కాటుకు గురై ఓ విద్యార్థి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బూర్జ పంచాయతీ వసనరంగని గ్రామానికి చెందిన కిల్లో భాను (14) జి.బొడ్డపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం రాత్రి పడుకున్నప్పుడు సుమారు రెండు గంటల సమయంలో మెడ దగ్గర కట్ల పాము కాటు వేయడంతో తెల్లవారుజామున అరకు ఏరియా ఆస్పత్రిలో తరలిస్తుండగా ప్రాణాలు విడిచినట్లుగా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న వెంటనే పాఠశాల వార్డెన్ కే.రమణమ్మ సిబ్బందితో పాటు కొంత ఆర్థిక సాయం చేసి భరోసా ఇచ్చామన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థికంగా చేసి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, సభ్యులు కె.రామన్న, కె.రాజు, భాస్కర్ డిమాండ్ చేశారు.

విద్యా సంస్థలలో..

పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు

-ఇకనుండి.. మన బడి నాడు-నేడు - జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని 130 అంగన్వాడి, 817 పాఠశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో పూర్తి స్థాయి మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా మండల విద్యాశాఖాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మన బడి నాడు-నేడు కార్యక్రమాన్ని స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇంప్రూవ్మెంట్ కార్యక్రమంగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమం క్రింద ప్రతి వారం కోటి రూపాయలు ఖర్చు చేసి పాఠశాలలలో మౌళిక సదుపాయాలు కల్పించాల్సి వుందని తెలిపారు. గతంలో జరిగిన ప్రగతిని సమీక్షించిన కలెక్టర్ 90 శాతం కంటే తక్కువ ఖర్చు అయిన వై.రామవరం, చింతూరు, పెదబయలు, నిలిపాక, కొయ్యూరు, మారేడుమిల్లి, ముంచింగిపుట్టు మండలాలు బాగా వెనుకబడి ఉన్నాయని ఆయా మండలాల ఎం.ఇ.ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జరిగిన పనుల ఫోటోలు, బిల్లులు సంబంధిత యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు.ఆయా ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు టెలీకాన్ఫరెన్స్లు నిర్వహించి పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యా సంస్థలలో జరుగుతున్న పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎప్పటికప్పుడు మెరుగుదల కనపడాలని కలెక్టర్ హితబోధ చేసారు. ప్రతి వారం పూర్తి చేసిన ఒక పాఠశాలపై రెండు నిమిషాల వీడియో చిత్రీకరించి పంపించాలన్నారు. సెంట్రల్లీ ప్రోక్యూర్డ్ మెటీరియల్ కు సంబంధించి ఇన్వాయిస్, బిల్లులు, మెటీరియల్ సరి చూసుకొని ప్రధానోపాధ్యాయులు సంబంధిత యాప్లో అప్లోడ్ చేయాలన్నారు. వై.రామవరం, నెలిపాక మండలాలలో అత్యధికంగా పెండింగ్ ఉన్నందున రెండు రోజులలో పూర్తి చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. మొత్తం 967 పాఠశాలల్లో 727 టాయిలెట్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇంజినీరింగ్ సహాయకులు వాటి ఫోటోలు తీసి ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కిచెన్ షెడ్స్, టాయిలెట్ల మరమ్మత్తులు, విద్యుత్ సౌకర్యం, తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రీన్ చాక్ బోర్డులు, ఐఎఫ్ వి పేనల్స్ అందినదీ లేనిదీ తెలియజేయాలని సూచించారు. ఈ అంశాలలో మన జిల్లా 15వ స్థానంలో ఉన్నందున ఇంజినీరింగ్, విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు.

నేను బడికి పోతా...

నేను బడికి పోతా కార్యక్రమం క్రింద బడి ఈడు పిల్లలు ఎవ్వరూ బడి బయట లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఇ.ఓలను, ఎటిడబ్ల్యుఓలను ఆదేశించారు. ఈ సందర్భంగా నేను బడికి పోతా అనే పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రతి గ్రామంలో బడి ఈడు పిల్లలను గుర్తించి వారికి బడిలో చేర్పించాలన్నారు. అందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహాయం తీసుకోవాలన్నారు. చింతూరు మండలంలో అత్యధికంగా 352 మంది బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్చినందుకు వారికి అభినందించారు. జిల్లాలో ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉందని, రాష్ట్రంలో జిల్లా చివరి స్థానంలో ఉన్నందున హాజరు పెరిగే విధంగా చూడాలన్నారు.



బ్యానర్ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత

పాఠ్య, నోటు పుస్తకాలు ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలని సూచించారు. ఎంఇఓలు తరచూ తనిఖీలు చేసి డైరీ నిర్వహించాలని ఆదేశించారు. రానున్న పక్షం రోజుల పాటు ఎంఇఓలు, ఎటిడబ్ల్యుఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి, నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి.అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, జిల్లా నుండి జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీ, గిరిజన సంక్షేమ డిడి కొండలరావు, ఇఇ డివిఆర్ఎం రాజు, ఎటిడబ్ల్యుఓలు, ఎం.ఇ.ఓలు పాల్గొన్నారు.

అదేవిధంగా రంపచోడవరం, చింతూరు డివిజన్ల నుండి ఎటిడబ్ల్యుఓలు, ఎం.ఇ.ఓలు, వీడియో కాన్ఫరెన్స్లో హాజరయ్యారు.



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన పూర్వ ఎఎన్ఎంలు

తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పూర్వ ఎఎన్ఎంల వినతి

ప్రజాశక్తి -మారేడుమిల్లి

గతంలో రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేసిన ఏఎన్ఎంలు తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేకు వినతిపత్రం ఇచ్చారు. ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో గతంలో ఎఎన్ఎంలు విద్యార్థులకు వైద్య సేవలు అందించేవారు. వైసిపి ప్రభుత్వం వారిని విధుల నుంచి తొలగించింది. ప్రస్తుతం టిడిపి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గిరిజన శాఖ మంత్రి గిరిజన ప్రాంతంలోని ఆశ్రమం పాఠశాలలో ఎఎన్ఎంలను విధుల్లోకి తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం గతంలో ఆశ్రమ పాఠశాలల హాస్టల్లో విధులు నిర్వహించిన ఏఎన్ఎంలు ఐటిడిఎ పిఒను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పోస్ట్ మెట్రిక్ ద్వారా రంపచోడవరం డివిజన్ పరిధిలో సుమారు 554 గిరిజన సంక్షేమ హాస్టల్లో 24/7 ద్వారా విద్యార్థులకు సేవలు అందించేవాళ్లమని చెప్పారు. ప్రస్తుత గిరిజన శాఖ మంత్రి ఆశ్రమ హాస్టళ్లలో ఎఎన్ఎం సేవలను కొనసాగిస్తామని ప్రకటించారని, కావున గతంలో పనిచేసిన ఏఎన్ఎంలకు మొదటి ప్రాధ్యానత ఇవ్వాలని కోరారు. గత ఐదు సంవత్సరాలు నుండి ఐటీడీఏ చుట్టూ తిరిగిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వమైనా తమ సేవలను గుర్తించి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ప్రాజెక్ట్ అధికారి ప్రభుత్వ నుండి ఉత్తర్వులు రాగానే ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధిత ఎఎన్ఎంలు పి చిన్నారి, ఎం వీరవేణి, కె స్వర్ణలత, బుల్లియమ్మ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

-మండల సమావేశంలో ఎంపిపి మణికుమారి

ప్రజాశక్తి-గొలుగొండ:అధికారులను సమన్వయంతో చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపిపి గజ్జలపు మణికుమారి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. శాఖల వారీగా సమీక్షలు చేశారు. గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు తమ గ్రామంలో శ్మశానవాటిక, రోడ్డును ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టాలని కోరారు. పుత్తడిగైరంపేట, ఏఎల్ పురం సర్పంచ్లు పత్తి రమణ, లోచల సుజాత మాట్లాడుతూ, తమ గ్రామాల్లో దేవాలయాలపై విద్యుత్ లైన్లు వేలాడుతున్నాయని, వాటిని సరి చేయాలని కోరారు. పాముకాటుకు ఇంజక్షన్ అందుబాటులో ఉంచాలని పలువురు సర్పంచ్లు కోరారు. దీనిపై గొలుగొండ పిహెచ్సి వైద్యాధికారి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, పాముకాటు మందు అందుబాటులో ఉందన్నారు. కాటు నిర్ధారణ తర్వాత రోగికి వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు మాట్లాడుతూ, ప్రస్తుతం మంజూరైన అభివృద్ధి పనులు గ్రామాల్లో పూర్తయ్యే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, ఎంపిడిఒ రత్నకుమారి, ఈఓపిఆర్డి రమణి, పరిపాలనాధికారి సత్యనారాయణ, ఎస్సైలు ఉపేంద్ర, కృష్ణారావు, ఆర్అండ్బి జేఇ ప్రసాద్, వైద్యాధికారులు ధనుంజై అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పిటిసి గిరిబాబు

యోగా శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం నుంచి యోగా శిక్షణా తరగతులను ప్రారంభ మయ్యాయి. హైస్కూల్ హెచ్ఎం కవిత, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకులు యేడిద వెంకట రమణ, పీడీ ఆదిలక్ష్మి యోగా శిక్షణా తరగతులను ప్రారంభించారు.వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా ట్రైనర్ దవరసింగి రాంబాబు పిల్లలకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్ఎం కవిత మాట్లా డుతూ, విద్యార్థులు నిత్యం యోగా సాధన చేయడంతో మంచి ఆరోగ్యం, జ్ఞాపకశక్తి కలుగుతుందన్నారు. యోగా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శిక్షణ ఇస్తున్న రాంబాబు



మురుగునీరు నిల్వ ఉండిపోయిన డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

డ్రైనేజీల్లో ప్రవహించని మురుగునీరు

- ప్రజల ఫిర్యాదుతో పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని దూసరపాము గ్రామంలో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా, అస్తవ్యస్తంగా డ్రైనేజీలు నిర్మాణ చేపట్టడంతో మురుగు నీరు బయటికి ప్రవహించడం లేదు. ఈ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రైనేజీల నిర్మాణ పనుల్లో నాణ్యత లేదని, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ నిర్మాణం చేశారని చెబుతున్నారు. దీంతో బయటకు పోవాల్సిన మురుగునీరు ఎక్కడి అక్కడే ఇళ్ళ మధ్య నిలిచిపోతుందని, దీంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలకు, ఈగలకు నిలయంగా మారినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావుకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఎంపీడీవో యాదగిరేశ్వరావు దూసరపాము గ్రామాన్ని సందర్శించి డ్రైన్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు నివేదికలను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దూసరపాము ఎంపీటీసీ నల్ల సత్యనారాయణ, గ్రామస్తులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎఎఫ్ఐ నేత

ఆశ్రమ పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్కృష్ణ

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా జీ.మాడుగుల మండలం కొక్కిరపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్కృష్ణ అధికారులను కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ పాఠశాలలో అడ్మిషన్ల కోసం సుమారు 40 మంది విద్యార్థినులు, వీరి తల్లిదండ్రులు గత కొద్ది రోజులుగా నిరీక్షిస్తున్నారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీట్లు ఖాళీ లేవని చెబు తున్నారని, ఈ ప్రాంతంలోని పలువురు విద్యార్థినీలు ఈ పాఠశాలలో చేరేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ మేరకు బుధవారం అడ్మిషన్ల కోసం వచ్చి పలువురు విద్యార్థినిలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. పాఠశాలల్లో చేరేందుకు సీట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీలు లేవని హెచ్ఎం లు చెబుతున్నారని చెప్పారు. పాఠశాలలో సీట్లు లేక గిరిజన విద్యార్థినులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. బాలికలు విద్యకు దూరమైతే బాల్య వివాహాలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.ఏజెన్సీ ప్రాంత విద్యాభివృద్ధికి ప్రతి విద్యార్థినికి అడ్మిషన్లు కల్పించే విధంగా సీట్లు కేటాయించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చెప్పడతామని ఆయన హెచ్చరించారు.

ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీ

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయ మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (గవర్నమెంట్ హైస్కూల్) లో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు, ఒక జూనియర్ అసిస్టెంట్ కు అల్లూరి సీతారామరాజు డీఈఓ బ్రహ్మాజీరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలోని హైస్కూల్ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఆలస్యంగా హాజరు కావడం, సమయానికి ఫేషియల్ హాజరు వేసుకోక పోవడం వంటి కారణాలపై హైస్కూల్ కి చెందిన ఉపాధ్యాయులు, జూనియర్ అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేశారు.

పాఠశాలలను శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక మండల గిరిజన సంక్షేమశాఖ సహాయ అధికారి మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బుధవారం ఆయన సందర్శించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ నిర్వాహణ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతోపాటు వసతి గదుల్లో విద్యుత్తు మరమ్మతు పనులు చేయించుకోవాలన్నారు. చుట్టూ పరిసరాలల్లోని పేరుకు పోయిన తుప్పలను తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎఫిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు కాచీ చల్లార్చిన నీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో మూడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు జరుగుతున్నాయని, ప్రవేశాలు కోరే గిరిజన విద్యార్థుల కుటుంబాలకు అవగాహన పరిచి పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా ఉపాధ్యాయులు ప్రతిఒక్క విద్యార్థికి ప్రవేశాలు చేయించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్డబ్ల్యుఓ పి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

-సమస్యలపై నిలదీసిన సభ్యులు
-అధికారుల నిర్లక్ష్యంపై సిపిఎం సర్పంచ్ ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి-అరకులోయ

అరకులోయ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా సాగింది. అరకులోయ మండల పరిషత్ అధ్యక్షురాలు రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన ఎంపీడీవో వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన ఈ పాలకవర్గ సమావేశంలో మండలంలోని వివిధ సమస్యలపై అధికారులను సభ్యులు ప్రశ్నించి నిలదీశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండిపడ్డారు. అప్పట్లో టిడిపి ప్రభుత్వ హాయంలో హుదూద్ తుఫాను కారణంగా సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో పిరిబంద గిరిజనుల కోసం నిర్మించిన మోడల్ కాలనీలో నేటికీ కూడా విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడంతో ఆ గ్రామస్తులు అంధకారంలో మగ్గుతున్నారని సిపిఎం సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు విద్యుత్ శాఖ ఏఈని నిలదీశారు. దీంతో, నెల రోజుల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన గిరిజనులకు పోడుపట్టాలు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు.

సుంకరమెట్ట డిఆర్డిపో పరిధిలో జిసిసి ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న కోటా బియ్యం సక్రమంగా పంపిణీ చేయలేదని, ఎస్.బెడ్డగూడ, విరిబంద,పెద్దగంగ గుడి, గేటువలస, కిన్నంగూడ, దండబాడు గ్రామాల గిరిజన లబ్ధిదారులకు మే నెల కు సంబంధించిన బియ్యంను నేటికీ పంపిణీ చేయలేదని, అయినా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కే.బెడ్డ గూడ గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని సంబంధిత ఆర్డబ్ల్యుఎస్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దాబుగూడలో నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని పెద్ద గంగ గుడి సంగవలస గ్రామాల్లో మరమ్మతు గురైన విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు.



అధికారులను నిలదీస్తున్న సిపిఎం సర్పంచ్ గెమ్మెలి చినబాబు

జల జీవన్ మిషన్(జెజెఎం) నిధులు మంజూరైనప్పటికీ ఎక్కడా కూడా మంచినీటి సౌకర్యం కల్పించకుండా సంబంధిత అధికారులు బిల్లులు ఎలా మార్చుకున్నారని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్, వైస్ ఎంపీపీ రామన్న, సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు, ఎంపిటిసి ఆనంద్ కుమార్ ప్రశ్నించారు. ఎంపిటీసీలు సర్పంచుల ప్రమేయం లేకుండా బిల్లులు మార్చుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ పనితీరు సక్రమంగా లేదని సారా బట్టీలు నడిపే వారిని వదిలేసి చిన్న చిన్న వ్యాపారులను పట్టి కేసులు పెట్టడం పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామాల్లో ఏ రహదారి బాగో లేదని దీంతో గిరిజనులకు డోలియే శరణమైందని, ఇంజనీరింగ్ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, బస్కి రోడ్డు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారని వారు ప్రశ్నించారు.ఆయా పంచాయతీల పరిధిలో శానిటేషన్ పనులు ఎక్కడ కూడా జరగడలేదని అరకులోయ జడ్పిటిసి సభ్యురాలు శెట్టి రోషిని అధికారులను నిలదీశారు. మండలంలోని ఉపాధ్యాయులు లేని పాఠశాలలో వెంటనే సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని వారు డిమాండ్ చేశారు. 30 మంది కన్నా తక్కువ పిల్లలు ఉన్న స్కూల్లో ఉపాధ్యాయులను నియమించుకోవడానికి తమకు అనుమతి రాలేదని ఎంఈఓ మోహన్రావు అన్నారు.ఈ సమావేశంలో ప్రస్తావించిన ప్రతి సమస్యను జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అరకులో జడ్పిటిసి శెట్టి రోషిని, అరకులోయ ఏటిడబ్ల్యా మల్లికార్జునరావు, ఐసిడిఎస్ పి ఓ శారద, ఎంఈఓ మోహన్రావు, డిప్యూటీ తహసిల్దార్ మత్స్యరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవిని అడ్డతీగల మండలం రాయిపల్లి, రంపచోడవరం మండలం ముసిరిమిల్లి, తామరపల్లి పంచాయతీలకు చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే శిరీషా దేవి, ఆమె భర్త తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు విజయ భాస్కర్ను సన్మానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రమాణస్వీకారం అయిన తర్వాత నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, అప్పుడు ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గణపతి, కారం నాగ సాయి, నాగు, నర్సారెడ్డి, తెల్లం భద్రం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులను సన్మానిస్తున్న టిడిపి కార్యకర్తలు

సికిల్‌సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత



జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు: సికిల్ సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత స్పష్టం చేసారు. సికిల్ సెల్ ఎనీమియాను 2047 నాటికి పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయన్నారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనిమియా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అవగాహనా సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యాన్ని అందరూ పదిలంగా ఉంచుకోవాలని చెప్పారు. మేనరిక వివాహాలతో వంశపారపర్యంగా సికిల్ ఎనీమియా సంక్రమిస్తుందన్నారు. మేనరిక వివాహాలు చేసుకోవద్దని హితవు పలికారు. ఇది అంటువ్యాధి కాదని జన్యుపరమైనధన్నారు.

అరకు పార్లమెంటు సభ్యురాలు తనూజా రాణి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి అవగాహనతోనే నిర్మూలించవచ్చున్నారు. ఈ వ్యాధిలో జిల్లా ద్వితీయ స్థానంలో ఉందన్నారు. 0-40 ఏళ్ల లోపు వారందరికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలో 6.76 లక్షల మంది జానాభా కలిగి ఉన్నారన్నారు. 3.50 శాతం మంది 40 ఏళ్ల లోపు వయస్సు వారున్నారన్నారు. ఇప్పటి వరకు 1.76 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేసామని చెప్పారు. 2300 మందికి సికిల్ సెల్ ఎనీమియా పోజిటివ్ గా నిర్ధారించి ప్రతీ నెలా మందులు, రూ.10 వేలు పింఛన్ అందించడం జరుగుతోందన్నారు. 2026 నాటికి నూరు శాతం పూర్తి స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేసారు. 30 వేల మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడానికి లక్ష్యంగా నిర్దేశించామన్నారు.

అరకు అసెంబ్లీ నియోజక వర్గం శాసన సభ్యులు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అధికారులు చెప్పిన సూచనలు పాటించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జమాల్ బాషా, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డా. విశ్వామిత్ర, డిసిహెచ్ ఎస్ కృష్ణారావు సికిల్ సెల్ ఎనీమియా పై అవగాహన కల్పించారు. వ్యాది లక్షణాల గురించి తెలియజేసారు. అంతకు ముందు అంబేద్కర్ కూడలి నుండి తలారిసింగి ఇండోర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఇంటింటికి వెళ్లి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షల నిర్వహణ ర్యాలీకి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. తలారిసింగ్ గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలో 100 మందికి ఐటిడిఏ సమావేశ మందిరంలో 30 మందికి సకిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఐ.సి.డి. ఎస్.పి.డి. సూర్యలక్ష్మి, డి.ఆర్.డిఏ పిడి, మురళి, ఎంపిడిఓ సాయి నవీన్, తహాశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, గిరిజన సంక్షేమ శాఖ డిఇ అనుదీప్, సిడిపిఓ ఝాన్సీ, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని, హెచ్ఎం రీమలి జాన్, జెడ్పిటిసి గిడ్డి విజయ లక్ష్మి పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా పై అవగాహన ర్యాలీలు

దుంబ్రిగుడ:సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పి.రాంబాబు కోరారు. మండల కేంద్రంలో ఎంపీడీవో జయ ఉమ, తహసిల్దార్ హేమావతి ఆధ్వర్యాన ప్రపంచ ఎనీమియా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆసుపత్రి నుంచి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా జాతీయ రహదారి వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. అరుకు పంచాయతీ కేంద్రంలో కిల్లోగుడ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచి శారద పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:సికిల్ సెల్ ఎనీమియాపై గిరిజనులకు అవగాహన కల్పించాలని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ ఆదేశించారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో బుధవారం నిర్వహించిన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముంచంగిపుట్టు ఆసుపత్రిలో 16 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించగా మూడు పోజిటివ్ వచ్చిందన్నారు. అనంతరం వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. గత ఎనిమిది నెలలో 1లక్ష 76 వేల మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాలలో ముందుగా దోమల నివారణ మందులు పిచికారీ చేసామన్నారు.పెదబయలు ఎపిఆర్‌జెసిలో నిర్వహించిన సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షల్లో 392 మందికి పరీక్షలు నిర్వహించగా 4 పోజటివ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ:అరకులోయలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థిని విద్యార్థులు బుధవారం అవగాహన సికిల్ సెల్ ఎనీమియాపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అరకులోయ టౌన్ షిప్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలోఎంపిడీవో వెంకటేష్, ఎంపీపీ ఉషారాణి, జడ్పిటిసి రోషిని, ఏటిడబ్ల్యూఓ మల్లికార్జునరావు, ఈవో రాజ్ కుమార్, ఎంఈఓ భారతిరత్నం, గన్నెల వైద్యాధికారిణి సిహెచ్ కమల, డిప్యూటీ తహశీసిల్దార్ కూడా మత్స్యరాజు పాల్గొన్నారు. సుంకరమెట్ట, కొత్తబల్లు గూడ పంచాయతీ కేంద్రంలో కూడా వైద్య సిబ్బంది,ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అనంతగిరి:స్థానికి పి.హెచ్.సి డాక్టర్ జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియాపై ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ దీసరి గంగరాజు, ఎంపిడిఓ నగేష్, తహశీల్దార్ బి.నాగజ్యోతి ఏటిడబ్ల్యూఓ.వెంకటరమణలు, మండల పరిషత్ సూపరింటెండెంట్ లక్ష్మినారాయణ డిప్యూటీ తహశీల్దార్ మాణిక్యం పాల్గొన్నారు

రంపచోడవరం :ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా రంపచోడవరం నిర్వహించిన అవగాహన ర్యాలీని బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద పిఒ ప్రారంభించారు. ర్యాలీ ఐటీడీఏ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు సాగింది. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-40 సంవత్సరాల వయసు ఉన్నవారికి రక్త పరీక్షలు ప్రభుత్వం ఆసుపత్రులలో చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపిఓ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, ఏడిఎంహెచ్ఓ జి.శిరీష, వైద్యాధికారులు వినోద్, కెవిన్, ముకుంద్, నిరంజన్, సుజిత, ఎంపిహెచ్ఓ పీటర్, హెల్త్ మానిటర్ ఝాన్సీ, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంపీడీవో హరికృష్ణ, ఎంఇఓ యం.రామకృష్ణ, ఎటిడబ్ల్యుఒ రామ తులసి, వివిధ పాఠశాలల విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి : సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీ స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నుండి పోలీస్ స్టేషన్ కూడలి వరకు ఎంపీడీవో ఎ.వీరకిషోర్, ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ శిరీషరాణి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్య అధికారి శిరీష రాణి మాట్లాడుతూ మండలంలో ఎవరైనా సికిల్ సెల్ వ్యాధి పరీక్షలు చేయించుకోలేని వారు ఉంటే తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ పరిపాలనాధికారి జయంతి, ఏబిపి మనస్విని, ఈవోపీఆర్డి విజయ్, ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బిఎస్.కుమార్, బాలురు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, వెలుగు సిబ్బంది, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు : ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా జికె.వీధి మండలం సీలేరులో అవగాహన ర్యాలీ చేపట్టారు. సీలేరు పిహెచ్సి వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో పిహెచ్సి నుంచి ర్యాలీని ప్రారంభించి పోస్ట్ ఆఫీస్ మీదగా సీలేరు మెయిన్ రోడ్డుకు చేరుకొని అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో, జిల్లా పరిషత్ జిటిడబ్ల్యు స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చింతూరు : మండలంలోని లక్కవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఇందులో చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కావురి చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తులసిపాక వైద్యాధికారి డాక్టర్ ఉదయకుమార్, చదలవాడ సర్పంచ్, విఆర్.పురం జెడ్‌పిటిసి, ఎటిడబ్ల్యుఒ, ఐటిడిఎ ఎఒ, సిబ్బంది, ఇఎంఆర్ఎస్ ప్రిన్సిపల్, ఎంపిడిఒ, ఎపిఎం, సీడీపీఓ, తులసిపాక వైద్యాసిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో అవగాహన ర్యాలీ



ఎపిఒకు వినతిపత్రం ఇజేస్తున్న నాయకులు, కూలీలు

ఉపాధి హామీ పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కరసలిగూడ గ్రామస్థులకు గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం అరకులోయ మండల ఏపీఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ కరసలిగూడ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం 4 గ్రూపులు, 79 జాబ్ కార్డులు, 175 మంది కూలీలున్నారని, ఏప్రిల్ నెల మొదటి వారం మాత్రమే వారం రోజులు పని కల్పించారన్నారు. తరువాత గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీకి సంబంధించి ఇతర సాంకేతిక కారణాలతో రెండు నెలలుగా పని కల్పించకపోవడం అన్యాయమన్నారు. నెలలు గడిచినా పని ఇవ్వక పోవడంతో కరసలిగూడ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు తీవ్రంగా నష్టపోయారని, సంబంధిత అధికారులు తక్షణమే పని కల్పించాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఏపీఓ వారం రోజుల్లో గ్రామీణ ఉపాధిహామీ పని కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు మగ్గన్న, రామారావు, గ్రామస్తులు డుంబరి హరి, ధర్మ, దోంబు, రోతోన్, జగ్గునాయుడు, చిరంజీవి, బాబురావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై హర్షం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ఇంటర్ విద్యార్థులకు ఈ ఏడాదిలో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయాలని రాష్ట్ర విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ జీవో జారీ చేయడం అభినందనీయమని తెదేపా మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ నాయకులతో జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఇంటర్ విద్యను విస్మరించిందన్నారు. గిరిజన ప్రాంతంలో పాఠశాలలు, కళాశాల సీట్లను కేటాయించకుండా గిరిజన ఉన్నత విద్యకు దూరం చేసిందన్నారు. టిడిపి ప్రభుత్వం పేద గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, పార్టీ నాయకులు చినగెన్ను, సింహాద్రి, బీమరాజు, త్రినాధరావు పాల్గొన్నారు.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

పేదలకు వస్త్రాల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తీగలవలస పంచాయతీ గరుడాపల్లి గ్రామంలో ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐటీసిసి), బైబిల్ ఓపేన్ యూనివర్సిటి ఆధ్వర్యంలో బుధవారం పేదలకు, వితంతువులకు వస్త్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం బైబిల్ కళాశాల లెక్చరర్ వేణు, ఎఐటీసిసి జిల్లా మహిళ అధ్యాక్షురాలు పల్టాసింగి రాజమ్మ, సిబ్బందితో కలిసి వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తోటి వారికి సహాయం చేయడంలో ఉన్న అనందం మరో కృటి లేదన్నారు. గిరిజన ప్రాంతంలో తమ సంస్థ నుంచి అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అరుకు కళాశాలల ప్రిన్సిపాల్ రాంబాబు, చిన్నిబాబు, కరుణకార్, దైవసేవకులు అర్జున్,నాగేష్,చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బాధితుల ఇళ్ల నిర్మాణానికి సిమెంట్ రేకులు, ఇనుప పైపులు వితరణ



ఇళ్ల నిర్మాణ సామగ్రి వితరణగా అందజేస్తున్న జెకెసి ట్రస్ట్

ప్రజాశక్తి-విఆర్.పురం : గాలివాన బీభత్సానికి ఇంటి పైకప్పులు విరిగిపడి, ఇళ్లు దెబ్బతిన్న బాధితులు తిరిగి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ రేకులు, ఇనుము పైపులను ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ తన జెకెసి ట్రస్టు ద్వారా అందజేశారు. ఈదురుగాలులకు పేదల నివాసాలు రేకులు విరిగిపోయి పైకప్పులు ఎగిరిపోయి నిలువ నీడ లేకుండా ఉన్నారు. ఈ తరుణంలో జమాల్ ఖాన్ బాధితులను పరామర్శించిన 24 గంటలలోపే ఇచ్చిన హామీ మేరకు బుధవారం మండలంలోని రాజపేట కాలనీ, ఒడ్డిగూడెం గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్న 17 కుటుంబాల వారికి రూ.85,000 విలువగల సిమెంట్ రేకులు, ఇనుప పైపులు జెకెసి ట్రస్టు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా విఆర్.పురం తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫజిల్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, వరదలు, పిడుగుపాటు వంటి సమయాల్లో నష్టపోయిన కుటుంబాలను అందరికంటే ముందుగా జమాల్ ఖాన్ పరామర్శించి, ప్రభుత్వం కంటే ముందే సహాయ సహకారాలు అందించి తన మానవత్వాన్ని చాటుకుంటున్నారని కొనియాడారు. కుల మత, వర్గ భేదం లేకుండా నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ ముందుకు వెళుతున్న జమాల్ ఖాన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, గ్రామ పెద్దలు ఆచంట శ్రీనివాసరావు, బురక కన్నారావు, బీరక ప్రకాష్ రావు, సభలం రాజు, బుర్ర నరేష్, ముత్యాల మల్లికార్జునరావు, ఎంవిఎస్ సిద్ధార్థ, ఎం శేఖర్, గొర్ర సూరి, వైస్ ఎంపీపీ వి.భాగ్యలక్ష్మి, సరఫరాజ అలీ, సోఫీ, జెకెసి ట్రస్ట్ సభ్యులు షాజహాన్. ఎస్‌కె రియాజ్, ఇంతియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పల్లా'కు భద్రత పెంపు

- బుల్లెట్ ప్రూఫ్ కారు కేటాయించిన ప్రభుత్వం

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతోపాటు తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం బుల్లెట్ ప్రూఫ్ కారును కేటాయించింది. బుధవారం తనకు కేటాయించిన కారులో ఎమ్మెల్యే పల్లా స్థానిక కుంచుమాంబ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాక ఇప్పటివరకు ఒక్కరే గన్‌మ్యాన్ భద్రత ఉన్న పల్లాకు ఇద్దరు గన్‌మెన్‌లతోపాటు ఎస్‌ఐ ర్యాంక్ అధికారిని సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారు.

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- వేపగుంట : వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎపిఇపిడిసిఎల్, ఆపరేషన్స్ విభాగం సూపరింటెండెంట్ ఇంజినీరు ఎల్.మహేంద్రనాథ్ అన్నారు. బుధవారం చీమలాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని క్రొత్తగా ఏర్పాటుచేసిన 11కెవి ఎపి టిడ్కో ఫీడర్ బ్రేకర్‌ను ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించుటకు ఈ బ్రేకర్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్, ఆపరేషన్స్ విభాగం మూడవ జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు, డిఇఇలు సిరికి అప్పన్నబాబు, ఉదయకిరణ్, ఎఇఇలు రమణమూర్తి, అప్పలనాయుడు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అప్రమత్తత

- నగరంలో పెరుగుతోన్న పాజిటివ్ కేసులు
- ప్రజా సహకారంతోనే నియంత్రణ సాధ్యం
- జిల్లా మలేరియా నిర్మూలనాధికారి డాక్టర్ తులసి



మాట్లాడుతున్న డిఎంఒ డాక్టర్ తులసి

ప్రజాశక్తి- సీతమ్మధార : డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ప్రజల సహకారం, భాగస్వామ్యం అవసరమని జిల్లా మలేరియా నిర్మూలనాధికారి డాక్టర్ తులసి అన్నారు. బుధవారం రామాటాకీస్ దరి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డిఎంహెచ్ఓ డాక్టర్ పి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడుతూ, నగరంలో ఇప్పటివరకు 202 మలేరియా, డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు సీజనల్ జ్వరాలు, కీటక జనిత డెంగీ, మలేరియా వంటి వ్యాధులు క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంటి ఆవరణలో, సన్‌సైడ్, టెర్రాస్‌పై మంచి, మురుగునీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు సెప్టిక్ ట్యాంకులు, ఖాళీ గొట్టాలకు నైలెన్ జాలీని కట్టుకోవాలన్నారు. దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందకుండా, అవి కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.. నిద్రించేటప్పుడు దోమతెరలు తప్పకుండా వాడాలని, పగటిపూట చేతులు, కాళ్లకు నిండుగా ఉండే దుస్తులు వేసుకోవాలని సూచించారు. చీకటి పడకముందే తలుపులు, కిటికీలు మూసేయడం ద్వారా దోమలు ఇంటిలోకి రాకుండా నివారించవచ్చన్నారు నగరంలో డెంగీ, మలేరియాపాజిటివ్‌గా నిర్ధారణ జరిగిన రోగులకు దగ్గరలోని యుపిహెచ్‌సిలో చికిత్స అందిస్తున్నామని, జ్వరలక్షణాలు, నీరసంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి, వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. డెంగీ, మలేరియాపై ప్రజలకు శాఖాపరంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ జీవన్‌రాణి డాక్టర్ సుమిత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు గ్రహణం వీడేనా..?

- పంపిణీ కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఐదేళ్లుగా నిరాదరణకు గురైన ఇళ్లు
- ఎన్నికలకు ముందు హడావిడిగా ప్రారంభం
- సౌకర్యాలు లేక వినియోగానికి దూరం



పద్మనాభపురంలో నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు పంపిణీ చేయని టిడ్కో ఇళ్లు

ప్రజాశక్తి -పెందుర్తి : గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టిడ్కో ఇళ్లకు ఇప్పటికైనా గ్రహణం వీడి తమకు పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఐదేళ్ల క్రితమే దాదాపు ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ, నివాసానికి అవసరమైన సౌకర్యాల కల్పనలో జాప్యం జరగడంతో, అప్పట్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా పంపిణీ జరగలేదు. తర్వాత ప్రభుత్వాలు మారడం, వైసిపి అధికారంలోకి వచ్చాక వీటిని పూర్తిగా వదిలేశారు. మధ్యలో లబ్ధిదారుల జాబితాల మార్పు, ఒక ప్రాంతంలోని ఇళ్ల వేరే ప్రాంతంలో వారికి కేటాయించడం వంటి గందరగోళం సృష్టించిన జగన్ ప్రభుత్వం, సరిగ్గా ఎన్నికలకు కొన్ని రోజుల ముందు రంగులు వేసి, హడావిడిగా ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. అయితే లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత లేకపోవడంలో, టిడ్కో గృహసముదాయాల్లో విద్యుత్, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు వంటి సౌకర్యాలు లేకపోయినా, ఐదేళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేయడంతో పాడైన ఇళ్లకు పైపైనే మరమ్మతులు, రంగులు వేసి ప్రారంభించారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో టిడ్కోలబ్ధిదారుల ఆశలు కాస్త చిగురించాయి. జివిఎంసి 92వ వార్డు పరిధిలోని పద్మానాభపురం శివారు ప్రాంతంలో ఉన్న టిడ్కో ఇళ్ల పరిస్థితిపై పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు దృష్టి సారించి, అధికారులతో సమీక్షించారు. దీంతో టిడ్కో ఇళ్లకు పూర్వవైభవం వస్తుందని, పూర్తి సౌకర్యాలతో అతిత్వరలో తమకు అందుబాటులోకి వస్తాయని లబ్ధిదారులు ఎంతో ఆశగా, ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-ఆనందపురం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపై ఉందని ఎంపిడిఓ అప్పలనాయుడు అన్నారు. బుధవారం నేలతేరు కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో మాట్లాడుతూ 6 నుండి 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరూ విధిగా పాఠశాలలో ఉండి చదువుకోవాలన్నారు. అంగన్వాడీ టీచర్లు, వాలంటీర్లు, అందరూ భాగస్వామ్యంగా వచ్చేనెల 12లోగా బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎంఇఒ గంగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికంతో చదువుకు దూరం అవుతున్న బాలబాలికలను గుర్తించి,వారిని ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, ఉన్నత పాఠశాల హెచ్ఎం బి శ్రీనివాసరావు, అంగన్వాడి టీచర్లు, సిఆర్‌పిలు, పిఇటిలు పాల్గొన్నారు.

చెక్కు బౌన్స్ కేసులో నిందితునికి ఏడాది జైలుశిక్ష

- రూ.పది వేలు జరిమానా

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : చెక్కు నిరాదరణ కేసులో నిందితునికి ఏడాది జైలుశిక్ష, మరో రూ.10 వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నం ఏడవ స్పెషల్ మెజిస్ట్రేట్ డి.విశ్వనాథం బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షాన మరో 3 నెలలు సాదారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పులో పేర్కొన్నారు.. ఫిర్యాదిదారు తరపు న్యాయవాది కదిరి రాము అందించిన వివరాలివి, విశాఖపట్నంలోని అక్కయ్యపాలేనికి చెందిన ఫిర్యాదిదారు కరుభుక్త పద్మ నుంచి గాజువాక అక్కిరెడ్డి పాలేనికి చెందిన నిందితుడు ఆడారి శాంతారాం, అతని భార్య ఆడారి లక్ష్మీకాంతం ఇరువురూ ఇంటి ఖర్చులు, చిల్లర రుణాల తీర్మానం, ఇతర అవసరాల కోసం 2021 ఫిబ్రవరి 14న, రూ.12 లక్షల అప్పు తీసుకొని దానికి ప్రామిసరీ నోటు రాయించి ఇచ్చారు. ఫిర్యాదిదారు ఎన్ని పర్యాయాలు అప్పు తీర్చమని అడిగినా, స్పందించని రుణగ్రహీతలు, ఎట్టకేలకు నిందితుడు ఆడారి శాంతారాం భార్యాభర్తలు ఇద్దరి తరపున 2023 జనవరి 23న రూ.10 లక్షలకు ఫిర్యాదీదారుకు చెక్కు ఇచ్చాడు. దాన్ని బ్యాంకులో వేయగా, సరిపడా నిధులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. దీనిపై చెక్ ఇచ్చిన శాంతారాం, అతని భార్య లక్ష్మీకాంతం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు లీగల్ నోటీసు జారీ చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ఫిర్యాదిదారు కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ జరిపి, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం నిర్ధారణ కావడంతో నిందితునికి జైలు,జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

26న విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -మాధవధార : షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం ఈనెల 26న మాధవధార, మాధవస్వామి కల్యాణ మండపంలోజరుగుతుందని షిప్‌యార్డు రిటైర్డుఉ ద్యోగులు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో బూసి ప్రసాద్ అధ్యక్షతన అసోసియేషన్ నెలవారీ సమావేశంలో గౌరవాధ్యక్షుడు బి సూర్యనారాయణ, అధ్యక్షుడు బూసి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె సుధాకర్ మాట్లాడుతూ ఈనెల 26న జరిగే షిప్‌యార్డ్ రిటైరీస్ 2వ ఆత్మీయ సమ్మేళనంలో షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 80ఏళ్లు నిండిన వృద్ధులను సత్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండుగ

ప్రజాశక్తి -పద్మనాభం: మండలకేంద్రం పద్మనాభంలో దుర్గాలమ్మ పండగ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం తోలేళ్ల ఉత్సవంతో ప్రారంభమైన వేడుకలో భాగంగా అమ్మవారి జోగిని చదురు గుడి నుంచి డోలు, డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపు జరిగింది. దుర్గాలమ్మ పండుగ సందర్భంగా పద్మనాభం సిఐ సిహెచ్ శ్రీధర్ గ్రామాన్ని సందర్శించి ఉత్సవాన్ని పరిశీలించారు. ఉత్సవ వివరాలను కమిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకుని, అనుపోత్సవానికి తగిన బందోబస్తు కల్పిస్తామని, శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఉత్సవ కమిటీకి, గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు టి. పద్దు, ఎ,రమణ, టి.పైడినాయుడు బీ.రాము, బి.శ్రీను పాల్గొన్నారు.

30న ఇంగ్లీష్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈనెల 30న ఉదయం పది గంటలకు ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో రంగసాయి మీడియా ఆధ్వర్యంలో స్పష్టమైన (ఆక్యురేట్) ఇంగ్లీష్‌పై శిక్షణాపరమైన అవగాహన తరగతి నిర్వహిస్తున్నామనిరంగసాయి మీడియా ప్రతినిధి బాదంగీర్ సాయి తెలిపారు.నిఘంటుకర్త, లెక్సికోగ్రాఫర్ సనపల జీవన్‌కుమార్ పాల్గొని, ఉద్యోగ ఇంటర్వ్యూలు, ఇతరత్రా సందర్భాల్లో ఇంగ్లీష్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ వర్క్‌షాప్‌లో అరుదైన ఇంగ్లీష్ గ్రామర్, వకాబులరీ, విదేశీ పుస్తకాలను పిడిఎఫ్ రూపంలో అభ్యర్థుల మొబైల్స్‌కు అందజేస్తామన్నారు. ప్రసిద్ధ వియస్‌డి. ఇంగ్లీష్ టు తెలుగు డిక్షనరీని స్పెషల్ డిస్కౌంట్‌పై ఇస్తామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆసక్తిఉన్నవారు 8247829025 సెల్ నెంబర్‌కు సంప్రదించి పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చని సూచించారు. నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సాయి సూచించారు.